# బలం పృధ్వీ ప్రవర్ధతామ్

-టి.పి.హేమమాలిని

ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

ఇంకా చలి చీకట్లు తొలగకుండానే మెలకువ వచ్చింది. సర్వలోక సంచారి భూలోక యాత్రకు బయల్దేరినట్లు తెలుస్తోంది. సన్నగా వచ్చిన వెలుతురుకి. పక్క మీద నుంచి పూర్తిగా లేవకుండానే కిటికీ కర్టెన్ తొలగించి గొళ్లెం తీసాను. చల్లగా కొట్టిన హేమంత మారుతం సుప్రభాతం చెప్పింది. ఆ స్పర్శను అనుభవిస్తూనే ప్రకృతి చిత్రంవైపు దృష్టి సారించాను.

ఇంటి ముందు పెరిగిన ఆకు పచ్చని పచ్చిక మీద అక్కడక్కడా రాలిన పసుపు గన్నేరు, ఎరుపు నూరు వరహాలు, కాషాయ రంగు గొబ్బాలతో తెల్లని పారిజాతాలు, కంచి పట్టుచీర మీద బూటాలా అమిరి, అందరికంటే ఆ సర్వాంతర్యామే గొప్ప డిజైనర్ అని ఉపదేశిస్తున్నట్లున్నాయి.

ఆకుల మీద అలవోకగా కదులుతున్న మంచు బిందువులు, వాటిని అలాగే ఏరి, ముత్యాలహారంగా కూర్చుకోవాలన్న చిత్రమైన అనుభూతిని కలిగింపచేసాయి.

అలా ఎంతసేపు గడిచిందో తెలియలేదు.

"అబ్బా! చలి!" చిన్నవాడు కదిలాడు. అందాల ఆరాధనకు ఆటంకం కలిగింది. కిటికీ తలుపు మూసి నా దుప్పటి కూడా వాడికీ కప్పి లేచాను. "వైదేహీ! కాఫీ ప్లీజ్!" నిద్ర మత్తులోనే గొణిగారు పతిదేవులు. ఇక లేవక తప్పలేదు.

ఫిల్టర్ వేసి బాత్‌రూమ్‌లో దూరాను. బ్రష్ చేసుకుని ముఖం కడుక్కుని వచ్చేసరికి డికాషన్ రెడీ అయింది. ఫ్రిజ్ లోంచి పాలు తీసి, చిక్కటి కాఫీ చేసాను. ఆ పరిమళాన్ని తనివి తీరా ఆస్వాదించాను. ఆయన్ని లేపి చేతిలో కాఫీ గ్లాసుంచాను. నేను కాఫీతో బాల్కనీలోకి నడిచాను.

వాకిట్లో నేను పెంచుతున్న రంగు రంగుల చేమంతులు అరి విరిసి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

నేను నా దినచర్యలో పడ్డాను. తాపీగా ఒకరి తర్వాత ఒకరు లేచారు. మరోసారి కాఫీ సేవిస్తూ పేపరు ముందేసుకోబోతూ, "నువ్వెప్పుడూ పేపరు చూడవేం?" ఖచ్చితంగా ఆ సమయంలో వేసి తీరాల్సిన ప్రశ్ననుకున్నట్లున్నారు ఆయన.

"కొత్త సంగతులుంటే చూడొచ్చు. దొంగతనాలు, దోపిడీలు, రేపులు, కిడ్నాపులు, మత వైషమ్యాలు, కుహనా రాజకీయాలు, కరవు, కాటకం, వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు..." చెప్పుకుపోతున్న నా ధాటికి అడ్డుకట్ట వేస్తూ "ఇలా డిస్లైకైపోతే పాపం, ఇన్ని న్యూస్‌పేపర్లకి మనుగడేది?" అన్నారు కళ్లజోడులోంచి చూస్తూ.

అన్నీ అంతే! దూది పింజలా తీసిపారేసి, వాతావరణాన్ని తేలిక పరుస్తారు.

"ఇదిగో చూసావా? చాలా ఘోరం జరిగిపోయింది. గుజరాత్‌లో భూకంపం వచ్చిందట." అనగానే ఎంత వద్దనుకున్నా ఒక్కంగలో ఆయన దగ్గరకి వచ్చాను.

"పాపం! ఎంతమంది బలయ్యారో చూసావా?" పేపర్లో చూడగానే వెంటనే టి.వి. స్విచాన్ చేసాను.

దేశమంతా రిపబ్లిక్ డే వేడుకల్లో మునిగి ఉంటే, భుజ్‌లో అంతులేని విషాదం. కళ్లప్పగించి టి.వి. వైపు చూస్తున్నాను.

శకలాల కింద నుజ్జయిన దేహాలు గుండెని మెలితిప్పుతున్నాయి. క్షతగాత్రులు, అసువులు బాసిన వారు, పసి పిల్లలు, వృద్ధులు... ఎవరికెవరో తెలీక బీభత్సంగా ఉంది.


పక్షపాత ధోరణి లేకుండా భూమాత కన్నెర్ర చేసింది. ఎందుకీ శాపం? మృత్యువు వివక్షత లేకుండా తన ఆహ్వానం పంపిన వారిలో మోసగాళ్లు, దొంగలు, నాయకులు, సేవకులు అందరూ ఉన్నారు. ఎవరికీ మినహాయింపు లేదు. ప్రకృతి వైపరీత్యం వలన సంభవించే మరణం ఒక్కటేనా కుల, మత, వర్గ బేధాలను రూపుమాపేది?

మూకుమ్మడి చావులు ప్రాప్తిస్తే తప్ప భూభారం తగ్గదా? అమాయకులు, సజ్జనులు, సంస్కర్తలని మినహాయించి భూమిపై అకృత్యాలకి కారణమవుతున్న వారిని తీసుకుపోవచ్చు కదా! దేశ ద్రోహులందరినీ ఒకసారే మట్టుపెట్టచ్చు కదా!

ఇలాంటి అనుకోని సంఘటనలు జరిగినపుడు ఆ ప్రదేశంలో ఉన్న పుణ్యాత్ములు బ్రతికిపోయి, దుర్మార్గులందరూ చచ్చేలా దేవుడు ప్లాన్ చేస్తే బావుంటుందేమో!

ఒక తీరున లేకుండా సాగుతున్న ఆలోచనలకి, అంత విషాదం లోనూ, అధర తటాకంలో దరహాస కమలం అలవోకగా విరిసింది.

"భూకంపం వచ్చింది భుజ్‌లో!" అప్పుడే ఆయనగారు మామూలు మూడ్‌లోకి వచ్చేసారు. శ్రీవారిని ఎప్రిషియేట్ చేయడానికి అదో మంచి కారణం.



"ఎందుకండి ఇంత విధ్వంసం? అభం, శుభం తెలియని పసి పిల్లల మీద కూడా జాలిలేదా?" తల్లి మనసు గొంతులోకి వచ్చింది దీనంగా.

"పిచ్చీ! లేకుంటే భూభారం ఎలా తగ్గుతుంది?" అనునయంగా అన్నారు. "భూభారం తగ్గాలంటే అవినీతి పరుల్ని, పదవి వదలని అక్రమార్కుల్ని, మాఫియా కింగ్‌లని మట్టుపెట్టచ్చు కదా? దేశం బాగుపడుతుంది." ముక్కు చివర అరుణ వర్ణం, పచ్చటి ముఖంలో నా ఆవేశాన్ని ప్రతిబింబింప చేస్తోందన్న సంగతి "బావుంది కలర్ కాంబినేషన్" అన్న ఆయన కామెంట్ వలన తెలిసింది.

"నేరస్తులే శిక్షింపబడుతున్నారా? నిర్దోషులు రక్షింపబడుతున్నారా? ఇదీ అంతే! అయినా ఇలాంటివి జరగకుండా ఉండాలంటే భూమికి బలం పెరగాలి. ఆ బలం పెరగాలంటే దుర్మార్గులు, అక్రమాలు తగ్గాలి. చెప్పాలంటే పెళ్లయితేనే కానీ పిచ్చి కుదరదు, పిచ్చి కుదిరితే కానీ పెళ్లి కాదు అన్న టైపన్నమాట. ఇలాంటివన్నీ ఒకదానికొకటి లింకు. సరే! మంచి కాఫీ కొట్టిస్తే అలా వెళ్లొస్తాను." ఆయన వచ్చినంత త్వరగా నేను మామూలు మూడ్‌లోకి రాలేకపోయాను.

* * *

మనసంతా గజిబిజిగా ఉంది. ఏదో తెలియని అలజడి. ఇదీ అని చెప్పలేని అనిశ్చితి. దృష్టి, మనసు, శరీరం అన్నీ తేజ గురించే ఆలోచిస్తున్నాయి. ఎందుకిలా చేస్తున్నాడు? వాడి మనసులో భావం బోధపడడం లేదు. టి.వి.లు వచ్చి విజ్ఞానాన్ని అందిస్తున్నాయా? విజ్ఞాన వృక్షాలుగా ఎదగాల్సిన విద్యార్థులను కలుపు మొక్కలై నాశనం చేస్తున్నాయా?

తల్లిదండ్రుల మీద తిరగబడచ్చని, చెప్పిన మాట వినక్కరలేదని అన్యాపదేశంగా చెపుతున్న టి.వి.లు, సినిమాల ప్రభావమేనా ఇదంతా?

ఏ పని వద్దంటే అదే చేయడం? గట్టిగా రెట్టిస్తే మరింత మొండి తేలతారని ఊరుకుంటే, అలుసుగా తీసుకుని రెచ్చిపోవడం. తమ్ముడితో ఆడుకోడు. ఎంతసేపూ టెన్‌స్పోర్ట్స్, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఛానల్స్ పెట్టి చూడడమే. వద్దని వారించిన కొద్దీ దానిమీద ఆసక్తి మరింత పెరుగుతుందని ఊరుకుంటున్నాను.

టెలివిజన్ నాగరికతలో మునిగి తేలుతున్న కుటుంబాలు, స్నేహితుల మధ్య పెరిగే వాతావరణం మరి.

చిన్నప్పుడు ఏకాభిప్రాయంతో మెలిగిన స్నేహితులే మారిపోయారు. పైగా నన్నాటపట్టిస్తారు పురావస్తు శాఖలో పనిచేయాల్సినదాన్నని.

నేను పిల్లలకు చెప్పే సద్బోధనలు ఉప్పులో కలిసిన పంచదార చందంగా మారాయేమోనని నా అభిప్రాయం. స్పీడ్‌గా పరిగెట్టినా, నాకు మాత్రం ఎడ్లబండిలో సాఫీగా సాగే ప్రయాణమే ఇష్టం. ప్రపంచం కంప్యూటర్‌లో మునిగినా, తేజ కొత్తగా ఓ అలవాటు చేసుకున్నాడు. ఎంత వద్దన్నా వినడం లేదు. నా చిన్నప్పుడు మా అమ్మమ్మ చెప్పిన విషయాన్నే వాడికీ చెప్పాను, ఆ అలవాటు మంచిది కాదని. చెప్పిన దానిని నన్నో మనిషిలాగే చూడలేదు.

వాడికి వత్తాసు మా శ్రీవారు. పెద్దయితే వాడే మారతాడు అంటారు. "మొక్కై..." అని నేను చెప్పబోతే పాత సామెతలు విని విని విసుగెత్తిందంటారు.

ఎలా? పిల్లల పెంపకంలో సమస్యలనే వైతరణిని దాటి అభివృద్ధి అనే వైకుంఠ ద్వారాలను చేరుకోవడం.

* * *

గోద్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో విధ్వంసం, కాశ్మీర్‌లో తీవ్రవాదుల ఆగడాలు, మత వైషమ్యాలని పెంచే రాజకీయాలు, పంజాబ్‌లో అల్లర్లు, మూడేళ్ల ముద్దుపాపాయిలో కూడా స్త్రీత్వాన్ని చూడగలిగే 'మగానుభావులు'... కిడ్నాప్‌లు, నక్సల్స్ విధ్వంసాలు... ఒకటేమిటి? ఏరోజుకారోజు జరుగుతున్న వినాశక చర్యలు న్యూస్‌పేపర్లకు, న్యూస్ ప్రింక్ కొరతను పెంచుతున్నాయి.

విదేశాల్లో ట్విన్‌టవర్స్ కూల్చివేత, ప్రతిఫలంగా ఎదురుదాడులు, రష్యాలో చెచెన్యా ఊచకోత, జపాన్‌లో భూకంపాలు, మధ్య ఆసియాలో అరాచకాలు... ప్రపంచం ఏమైపోతుందోనన్న బాధ, బెంగ.

ప్రకృతి సృష్టించిన బీభత్సాలు కొన్నయితే, మానవ మేధస్సు పదును పెరుగుతోందని సంతోషించాలో, కూడదో తెలియనట్లు నిర్మిస్తున్న విధ్వంసక వ్యూహాలు కొన్ని.

శ్రీవారు వాచించినట్లు భూభారం తగ్గి భూబలం పెరగాలి.

"ఏవమేతత్పురావృత మాఖ్యానం భద్రమస్తువః
ప్రవ్యాహరత విస్రబ్ధత బలం విష్ణోఃప్రవర్ధతామ్."

ఈ బలం విష్ణోః ప్రవర్ధతామ్ అన్నది రెండుసార్లు చదవాలిట. తద్వారా విష్ణువుకు బలం పెరిగి జీవకోటిని సంరక్షిస్తాడట.

నిజం చెప్పొద్దూ! ఆరోజునుంచీ రెండుసార్లు కాదు ఎన్నిసార్లు వీలయితే అన్నిసార్లు చదవడం మొదలెట్టాను.

* * *

"తనని ప్రేమించలేదని అమ్మాయిని గొడ్డలితో నరికి చంపిన యువకుడు". శ్రీలక్ష్మి అనే అమ్మాయిని, మనోహర్ అనే ఉన్మాది బలి తీసుకున్న వైనం చదివి వినిపించారు.

అతనికి బెయిలివ్వకూడదని నిర్ణయించారట. అల్లారు ముద్దుగా పెంచుకున్న అమ్మాయి పాశవికంగా ఓ రాక్షసుడి చేతిలో హతమైతే ఇంకా కేసులు, వాదనలు, తీర్పులు ఏమిటి? ఆ పశువుని వెంటాడి, వేటాడి ఎందుకూ పనికి రాకుండా చేసి బతుకుతూ చచ్చేలా, చస్తూ బతికేలా చేయాలి. అదే అన్నాను ఆయనతో.

"నీ అభిప్రాయం ప్రకారం తీర్పులివ్వాలంటే రాజరికాల్లో, నిరంకుశ ప్రభుత్వాల్లో మళ్ళీ రావాలి. ప్రజాస్వామ్యంలో అది జరగదు. కూల్ డౌన్." నా ఆక్రోశం అర్థం చేసుకున్నట్లు నా చేతిని పట్టుకుని చెప్పారు.

మరి కొన్నాళ్లకే తమిళనాడులో కుంభకోణంలో పాఠశాలలో హఠాత్తుగా సంభవించిన అగ్నిప్రమాదం, ఇంకా రెక్కలైనా రాని పక్షుల లాంటి పిల్లలను, మొగ్గ దశలోనే ఉండి రేకులు వీడని పసివాడని పసి వాళ్లని నిర్దయగా, కర్కశంగా మాడ్చేసింది.

విగత జీవుల్లా పడి ఉన్న బాలల శరీరాలను, ఎవరి బిడ్డ ఎవరో తెలియక మూకుమ్మడిగా ఏడుస్తున్న తల్లులను చూసి హృదయంలో ఏదో తెలియని బరువు దించుకోలేనట్లు అయింది.

* * *

మరి కొన్నాళ్ళకే మరో ఊహించని వినాశం. ప్రకృతి మరోసారి మానవుడిపై విరుచుకుపడింది.

ఎక్కడో ఇండోనేషియాలో ఉద్భవించిన సునామీ సుడిగుండం జన జీవనాన్ని అతలాకుతలం చేసింది. ఇళ్లు, మనుషులు, ఆస్తులు... సమస్తం, సర్వం తుడిచి పెట్టుకుపోయాయి. టి.వి. లో కన్పించే దృశ్యాలను చూస్తూ "అయ్యో! ఏంటండీ ఇది? ఎంత ఘోరం!" నిర్ఘాంతపోయాను.

"ఇన్నాళ్లూ భూమి మీద భూకంపం మాత్రమే తెలుసు. ఇది సముద్రంలో భూకంపం. అయితే ఇందులో మెచ్చుకో దగ్గ విషయం ఒకటుంది. అదే, 'సునామీ' అన్న కొత్త పదం తెలిసిందిగా "ఎప్పటిలాగే వాతావరణం తేలిక పడడానికి తన వంతు చేసారు.

"దీని మీద మీ కామెంట్ ఏమిటి?" అడిగాను.

"సేమ్ ఓల్డ్ కామెంట్. భూమికి బలం పెరగాలి. భూమాత పై గురుతర బాధ్యత పెరిగిపోతోంది. ఆవిడేమో దుర్బలురాలవుతోంది. నువ్వే విటమిన్ మాత్రలు వాడుతున్నావు. సంసారం భారం మోస్తున్నానంటూ!" జోకేసాను కున్నారు ఆయన.

బంధాలు కోల్పోయిన వారిని, వేరుపడిన తల్లి బిడ్డల్ని, విడిపోయిన భార్యా భర్తలను చూసి ధారాపాతంగా కారిపోతున్న కన్నీళ్లను చూస్తూ "ప్లీజ్ వైదేహీ! ఇంట్లో సునామీ రానివ్వకు. మన వంతు మనం చేద్దాం. జరుగుతున్న సంఘటనలు మరచిపోక పోతే మనుగడ కష్టం" అని అంటున్న ఆయన మాటలకు అర్థమైనట్లు తల ఊపాను.

* * *

"తేజా! ఎలాగైనా నీ పద్ధతి మార్చుకుని తీరాలి. లేదంటే నేనూరుకోను"

నేను కూడా మొండి కెత్తినట్లు చెప్పాను.

అయినా సరే! నా వైపోసారి అభావంగా చూసి, పప్పన్నం రెండోసారి కలుపుకున్నాడు. కందిపప్పు దోరగా వేయించి, ఉడికించిన తర్వాత బెల్లం వేసి చేసే తియ్యటి పప్పంటే వాడికిష్టం.

నాక్కూడా అంతే! చిన్నప్పుడు బక్కలా ఉండేదాన్నని రోజూ రెండు పూట్లా పప్పులో కమ్మటి నెయ్యి వేసి ముద్దలు కూరేది మా అమ్మమ్మ. తినేటప్పుడు ఆవిడ చెప్పిన విషయం ఎప్పటికీ మరచిపోలేను. అన్నం తినేటప్పుడు ఎడంచేతిని నేలకి ఆన్చకూడదని చెప్పేది. ఎందుకంటే మనం కుడిచేత్తో తిన్నదంతా ఎడంచేతి ద్వారా భూమికి వెళ్ళిపోయి మనకి శక్తి తగ్గిపోతుందని చెప్పేది.

ఆ విషయమే తేజకి చెప్తే వాడు వినడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా ఆ అలవాటు మాన్పించలేక పోతున్నాను. అది చాలనట్లు బకాసురుడిలా తింటున్నాడు. దిష్టి తగలకూడదని అనుకున్నా. ఎందుకో అసాధారణంగా అన్పించింది వాడి ప్రవర్తన. ఒక్కోసారి నలుగురికీ వండినదంతా వాడే తినేస్తున్నాడు. ఇంక ఊరుకోదలుచుకోలేదు. శ్రీవారి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాను. మౌనమే భాషగా మారింది. చూపులే వాద ప్రతివాదాలయ్యాయి.

"ఇంతకీ వాడన్నం తినేటప్పుడు ఎడం చేయి నేలకాన్చకూడదని నీ వాదన. అంతేనా వైదేహీ!" స్పష్టంగానే తలూపాను.

"తేజా! అమ్మేం చెప్పినా నీ మంచికోసమే అని తెలుసుకో. అమ్మ చెప్పినట్లు ఆ అలవాటు మానుకోవచ్చు కదా!" తేజని బుజ్జగించినట్లు చెప్పారు. తేజ మాట్లాడలేదు. మరోసారి రెట్టించినా సమాధానం లేదు.

"నిన్నే!" నాకు తెలిసి ఆయన అంత గట్టిగా అరవడం వినలేదు.

"ఎందుకు నేను ఆ అలవాటు మానుకోవాలి?" వాడూ అలాగే అరిచాడు.

"ఎందుకు మానాలి! దానివలన మంచి జరుగబోతున్నపుడు ఎందుకు మానాలి?" మళ్ళీ అరిచాడు.

నేనూ, ఆయన్నా ఎన్నో భావాలు కలిసిన మా మొహాలు ఒకరినొకరు చూసుకున్నాం.



ప్రతి మనిషికీ బాధ్యత పెరిగి నా ఒక్కడి వలన ఏం జరుగుతుందిలే అనుకోక తన వంతు చేయాలి. అప్పుడు కచ్చితంగా భూభారం తగ్గి, భూమాత సంతోషిస్తుంది. అన్నీ కాలానుగుణంగా జరుగుతాయి. అనుకోని అవాంతరాలు ఎదురుకావు.

"మంచా?" ఒకేసారి అడిగాం.

"అవును డాడీ! మీరే కదా! అస్తమానం భూమికి బలం పెరగాలి అంటూ ఉంటారు. మరి ఆ బలం పెరగాలంటే ఏం చెయ్యాలి? అమ్మ వాళ్ళ అమ్మమ్మ చెప్పినట్లు అన్నం తింటుప్పుడు రెండో చెయ్యి భూమ్మీద ఆన్చితే నేను తినే అన్నం శక్తి అంతా నేలకి వెళ్తుందనీ, దాని వలన భూమికి బలం పెరుగుతుందనీ అలా చేస్తున్నాను. తప్పా? నన్ను అలా చెయ్యద్దనే బదులు మీరు కూడా నాలాగే చేస్తే భూమికింకా బలం పెరిగి, మనందరినీ మోసే శక్తి వస్తుందిగా?" ఆవేశంగా అరిచాడు.

నేను సర్వ్రదష్టనయ్యాను. చేష్టలు దక్కి నిలబడిపోయాను.

ఈ చిన్నబుర్రలో ఇంత ఆలోచన ఉందా? అందుకా? అందుకేనా? నా మాటని లక్ష్యపెట్టలేదని నేనరచినా, తిట్టినా నోరు మెదపక అదే పనిని చేస్తూ వచ్చాడు.

ఒక వసంత గానం, ఓ గ్రీష్మ తాపం, ఓ శరన్మేఘం, మరో హేమంత తుషారం. ఒకేసారి కట్టకట్టుకుని చుట్టుముట్టిన భావన.

ఆనందం, ఆశ్చర్యం కలిసిపోయి వాటి ఉనికిని మర్చిపోయిన అనుభూతి. ఆ బుజ్జి మనసులో నేను చెప్పిన కట్టుకథే ఇంత ఊహను పెంచిందంటే నిత్యం రకరకాల బాధలు, సమస్యలు భరిస్తూ, అనుభవిస్తూ బతికే ప్రజానీకంలో ఎంత మార్పు రావాలి? చేయాల్సిన మంచి పనులు ఎన్ని పెరగాలి?

అక్రమాలు, అరాచకాలు చేస్తూ పోతున్న పాపులకు, దేశాన్ని కబళించి వేస్తున్న ద్రోహులకు ఈ ఆలోచన వచ్చి చేస్తున్న పనులకు స్వస్తి చెప్పి, శుభాలకు శ్రీకారం చుడితే భూమాతకు బలం పెరిగి తీరుతుంది. ప్రతి మనిషికీ బాధ్యత పెరిగి నా ఒక్కడి వలన ఏం జరుగుతుందిలే అనుకోక తన వంతు చేయాలి.

అప్పుడు కచ్చితంగా భూభారం తగ్గి, భూమాత సంతోషిస్తుంది. అన్నీ కాలానుగుణంగా జరుగుతాయి. అనుకోని అవాంతరాలు ఎదురుకావు.

తేజని ఒక వర్ణించలేని భావంతో హత్తుకున్నాను. ఫర్వాలేదు. వాడి మనసులోని ఆర్ద్రత వాడు 'నేటి' ప్రపంచంలో ఒక వ్యక్తిగా మారలేదని స్పష్టం చేసింది.

నా పెంపకం వృధా పోలేదన్న ఆనందం కుదిపేసింది.

ఆ రోజు నుంచీ నేను చదివే శ్లోకాన్ని మార్చాను.

'ఏవమేతత్పురావృత్త మాఖ్యానం భద్రమస్తువః
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం పృథ్వీ ప్రవర్ధతామ్'

ఈ చివరి మాట నా నాలిక మీద ఆడుతూనే ఉంటుంది, వరవరమునుల నోట్లో ద్వయం మంత్రంలాగా. ★